నమ్మకంతో మనిషిని దేవుడు సృజించాడు. కాని, మనం చేస్తున్నదేమిటి? ఎండకి ఏసీలు పెట్టుకున్నాం. చలికి రగ్గులూ, రూమ్ హీటర్లు వాడుతున్నాం. వానకి గొడుగులూ, రెయిన్ కోట్లూ వాడుతున్నాం. స్వార్థంతో, స్వసుఖాపేక్షతో సాటి ప్రాణుల్ని హతమారుస్తూ ప్రకృతి శక్తుల్ని ప్రతిఘటిస్తూ సృష్టికర్తనే అవమానిస్తున్నాం! తగినంత ఎండా, వానా, చలీ దేహానికి తగలని మానవులు అనారోగ్యంలో పడిపోతున్నారు. ఇంతకీ ఎండగాని, వాన గాని ముందు తగుల్తున్నది నాకే కదా!''

వెనకటికి తెలుగు సమంగా ఉచ్చరించలేని ఒకానొక అన్య భాషీయుడిని; "అయ్యో, ఇలా చిక్కిపోతున్నావేమిటి!'' అని ఒక తెలుగువాడు పరామర్శిస్తే "అరె; చిక్కీపోతామ్; సచ్చీపోతామ్ బే; నీ కెందుక్కు!'' అన్నాడట - అని స్వామి బాత్‌రూం కెళ్లినప్పుడొకరు కామెంట్ పాస్ చేసేరు.

1964లో నేను హైదరాబాద్‌లో ఉద్యోగంలో ఉండగా ఒక విశాఖమిత్రుడు (హై)కోర్టు పనిమీద వచ్చాడు. ఇప్పట్లా అప్పుడు బెర్తు రిజర్వేషన్లు లేవు. బాగా ముందుగా వచ్చి, సామాన్లు పెట్టుకునే పై బెంచీమీద తువ్వాలు పరుచుకుంటే అదే పడకగా ఖాయం అయ్యేది. ఈ మిత్రుడు కొంచెం లేటుగా ఒచ్చేసరికి తువ్వాలు పరిచే ఖాళీలన్నీ భర్తీ అయిపోయాయి. "ఏం చేస్తారు మరి; ఏదో కార్నర్ సీటు చూసుకుని కూర్చోండి'' అన్నాను.

"అయ్యబాబోయి, అలా మాత్రం దీవించకండి'' అన్నాడా మిత్రుడు; రావిశాస్త్రి గారి కథ గుర్తొచ్చి కాబోలు,

★

# 56. బాషా హుషార్

**బా**షా అని; వెనక నేను హైదరాబాదు టవున్ సర్వేలో పని చేస్తూ వుండినప్పుడు ఇంకో రేంజిలో సర్వేయరుగా ఉండేవాడు. నేను తిరువూరు నుంచి హైదరాబాదుకి ట్రాన్స్‌ఫరై రాకముందు నుంచీ అతను హైదరాబాదులో పనిచేస్తున్నాడని తెలిసినా, అన్ని రేంజిల వాళ్లమూ ఒకసారి ఎక్కడా కలుసుకొనే అవకాశం ఉండకపోడాన్నించి అతను కొంత కాలం నాకు పరిచయం అవలేదు. ఐతే నేను జాయినైన రెండు నెలలకి అతను నా రేంజిలోకి ట్రాన్స్‌ఫరై వచ్చాడు. మా అసిస్టెంటు డైరెక్టరు గారు స్వయంగా అతన్ని నాకు పరిచయం చేసేరు. "యూసుఫ్ గుడాలో కాపరం. పెళ్లి చేసుకోలేదు. తల్లీ తండ్రీ ఉన్నారు. వాళ్లకి అన్నీ అమర్చి పెట్టి మరీ డ్యూటీకి రావాలి ఇతను. అందుకని దిల్‌సుఖ్‌నగర్ రేంజి నుండి నీ రేంజికి మార్చేను. ఇతనికి బాహ్‌లూల్ ఖాన్ గుడాలో వర్కు ఇయ్యి'' అని చెప్పేరు.

"ఉద్యోగికి దూరభూమి లేదని నీతిచంద్రికలో చెప్పేరు. నీతిచంద్రిక ప్రకారం, సుమతీ శతకం ప్రకారం అన్నీ చేస్తున్నామా అంటే; చెయ్యగలిగినంత మేరకి చెయ్యాలికదా! మాది విజయనగరం. ఆ ఊళ్లో ఒక సర్వే పార్టీ ఉంది. ఆ ఏరియాలో నా కేటగిరీవి పదహారు పోస్టులున్నాయి. అయినాసరే హైదరాబాదు వెయ్యగానే నోరు మెదపకుండా నేనొచ్చేనా లేదా? అందరికీ పొయ్యిపక్కనే ఆకుమడి కావాలంటే అమరుతుందా? ముందు హైదరాబాదు జిల్లాకి

వేస్తే చాలని అడుగుతారు. ఆ తరవాత హైదరాబాదు సిటీలో (అదే జంటనగరాల్లో) వేయండి బాబో అని ప్రార్థిస్తారు. ఆ తరవాత ఫలానా వార్డులోనే డ్యూటీ వెయ్యండి మహాప్రభో అని ఒత్తిడి తెస్తారు. మన అసిస్టెంటు డైరెక్టరు గారు లివ్ అండ్ లెట్ లివ్ అన్న పద్ధతిలో ఎవరికెవరికెలాటెలాటి సదుపాయాలు కావాలంటే వారికి అవన్నీ సమకూర్చి తమకి వారివల్ల ఎలాటి సౌఖ్యం కావాలంటే అది పొందే రకం కనక సరిపోయింది!'' అన్నాను; పనిలో పనిగా ఏ.డీ. గారి మీద కూడా ఓ దెబ్బ విసిరి.

"హైదరాబాదు మా స్వస్థలమూ కాదు; యూసుఫ్‌గూడాలో మేం ఉంటున్నది మా స్వంత యిల్లూ కాదు సార్'' అన్నాడు బాషా.

బాషా భాష వినగానే నేను నోరుపారేసుకున్నానని నాకు అర్థమైపోయింది. అయినా ఇంకా ఉపన్యాసపు ఫోర్సు తగ్గక, "మరి?'' అన్నాను.

"నేను అప్పుడప్పుడు కవిత్వం రాస్తానండి. ఆ రేంజిలో హెడ్ సర్వేయరు దినమణి గారు తమిళియన్ సార్. మీకు తెలుగు బాగా తెలుసుకదండి సార్. అందుకని మీ దగ్గిర నా సర్వే రికార్డు సరిచేయించుకున్నట్టే నా కవిత్వం కూడా సరిదిద్దించుకోవచ్చు కదా అని వేరే సాకు పెట్టి ఈ రేంజికి ట్రాన్స్‌ఫర్ అడిగాను సార్!''

దాంతో నేను వ్యక్తిగా సంబరపడిపోయినా అధికారిగా దెబ్బతినేశానేమో అనిపించింది.

"మీ స్వస్థలం ఎక్కడ?'' అని అడిగేను.

"నిజామాబాద్ జిల్లా బోధన్, సార్''

అది మొదలు; అతనూ నేనూ డ్యూటీ మీద కలిసి తిరుగుతున్నప్పుడు కూడా బాషా భాషలో సర్కారు పద్ధతి ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపడడానికి సిద్ధం అవడం నాకు అలవాటయింది.

ఓసారి నాకు అతను ఒక పత్రికలో జోకులాంటి ఒక వాక్యం చూపించేడు. "మనకీ పాకిస్తాన్‌కీ మౌలికమైన భేదం : మనం ఇల్లా అంటే వాళ్ళు అల్లా అనడమే''

ఇంకోసారి నేనతనికి ఒక హోటల్ తాలూకు బోర్డు చూపించేను. "హోటల్ అప్సర'' అని తెలుగులో రాసి ఉంటే, దాని కిందని ఇంగ్లీషులో "హోటల్ అఫ్సర్'' అని ఉంది. అతను వెంటనే తన సైకిలు ఆపి నా సైకిలు ఆపించాడు. "ఉర్దూలో ఏమని రాసేడు; చదవండి'' అన్నాను గాని అతను వినిపించుకోలేదు. తిన్నగా ఆ హోటల్లో కెళ్ళి కౌంటర్ దగ్గిర కూర్చున్న పెద్దమనిషికి "అస్సలా మలేకం'' చెప్పేడు. ఉర్దూలో ఏదో మాట్లాడేడు.

వాళ్ళు "అఫ్సర్'' అనే రాయమన్నారుట. కాని ఆ పెయింటర్‌కి తెలుగు అక్షరాలు సమంగా రాక, దారేపోతున్న వాళ్లలో తెలుగు బాగా తెలుసునన్న ఒక మనిషిని పట్టుకుని "హోటల్ అఫ్సర్'' అని తెలుగు అక్షరాలలో రాసి చూపించమన్నాడట. ఆ మనిషికి అఫ్సర్ సంగతి కన్నా "అప్సర'' సంగతి ఎక్కువగా తెలిసి ఉండడం చేత కాబోలు; అతను అలా కాగితంమీద రాయడమూ, పెయింటర్ దాన్ని ఉన్నదున్నట్టుగా కాపీ చెయ్యడమూ జరిగాయట.

ఆ మర్నాడు బాషా ఒక పెయింటర్ని సరంజామాతో సహా అక్కడికి లాక్కెళ్లి ఆ బోర్డులో ఉన్న అప్సరని అఫ్సర్‌గా మార్పించేడు.

"ఎలాంటెలాంటి శబ్ద విపరిణామాలు అర్థవిపరిణామాలూ ఉన్నా సరే; బేసికల్‌గా అంటే మౌలికంగా ఉన్న తేడాలు అన్నిరంగాల్లోకి పాకుతాయండి. మాటవరసకి విక్రమ్ అంటే మీకు గొప్పకదా; మాకు అక్రమ్ అంటే గొప్ప. అక్రమ్ అనే పేరుగల మనిషిని చూసినా విన్నా క్రూరసేనుడు, దుష్టబుద్ధి, అగ్నిహోత్రావధానులు వంటిపాత్రలు గుర్తొచ్చి మీకు భయమో, చిరాకో పుట్టించవచ్చు" అని ఒకసారి బాషా వ్యాఖ్యానించడం నాకిప్పటికీ జ్ఞాపకమే.

తరవాత నేను హైదరాబాదు నుంచి ట్రాన్స్‌ఫరు అయిపోడమూ, క్రమంగా నా ఉద్యోగనావ విశాఖరేవుకి చేరడం జరిగినా; ఈ మూడు దశాబ్దాల కాలంలో బాషా నా కప్పుడప్పుడు గుర్తొస్తూనే ఉండేవాడు. అందుకనే; మొన్న ఈమధ్య ఒక ఇరానీ హోటల్లో "చాయ్" తీసుకుంటూ కొంచెం దూరంగా ఉన్న టేబిలుదగ్గర తెలుగు ఘజల్ చెబుతున్న అతన్ని గుర్తుపట్టగలిగేను.

"తెలుగు నాటకాల్లోనూ నవలల్లోనూ మహమ్మదీయులు మాట్లాడే తెలుగుని ఉన్న దున్నట్లుగా రాసిన అన్ని సందర్భాల్లోనూ దాంట్లోంచి హాస్యం ఉత్పత్తిచేసే వ్యర్థ ప్రయత్నమే కనబడుతోంది. ఏదైనా ఒక భాష మాతృభాష కానివాళ్లు; ఆ భాషలో మాట్లాడిన అన్ని సందర్భాలలోనూ; వినేవాళ్లకి, కొంత క్షమ అవసరం. దాన్ని అపహాస్యం చేసి ఎద్దేవా చేయటం న్యాయం కాదని నా ఉద్దేశం. ఆమాటకొస్తే మహమ్మదీయుల్లో కూడా మంచి తెలుగు పరిపుష్టమైన సంస్కృతం పొదిగి మాట్లాడే వాళ్లూ రాసే వాళ్లూ ఉన్నారు కదా!" అన్నాడు బాషా.

"అవును. పాతకాలం నాడు ఉమర్ ఆలీషా గారు రాసిన పద్యాలో, నవలలో చదివితే మీరన్నది నిజమని తేల్తుంది. అంతెందుకు! ఈమధ్యకాలంలో కూడా వజీర్ రెహ్మాన్, ఇస్మాయిల్, స్మైల్, దేవిప్రియ, గౌస్, అఫ్సర్, యాకూబ్, ఖాదర్, ముకరమ్ ఇలా ఎందరున్నారో; గొప్ప తెలుగురాసినవారు! రాయగలగడం అనే శక్తి అపారంగా ఉన్న ఇలాంటి వాళ్లు తల్చుకుంటే హైదరాబాదులో అవసరార్థం ఉర్దూ మాట్లాడుతున్న "తెలుగు ఉర్దూని" ఎద్దేవా చెయ్యలేక పోదురా?" అన్నాను నేను; ఆ ఇరానీ హోటల్లోంచి బైటపడుతూ.

"ఇంకా బోర్డుల సంస్కరణ చేస్తున్నారా, లేక చాలించుకున్నారా?" అన్నాను అతన్ని కులాసా చేద్దామని. అలా నేను అనడమేమిటి; అతను తల ఎత్తి ఇంతసేపూ మేం కూర్చున్న ఆ హోటల్ బోర్డువేపు చూసేడు.

అక్కడ ఇంగ్లీషులో "హోటల్ నయాగరా" అని ఉంది. దానికి పక్కగా తెలుగులో "హోటల్ న్యాగ్రా" అని వుంది.

మళ్లీ మామూలే. బాషా హోటల్లోకి ప్రవేశించడం, కౌంటరు దగ్గరున్న మనిషికి "అస్సలా మలేకొం" చెప్పడం ఉర్దూలో సంభాషణ చివరికి బోర్డు దిద్దించడం- వగైరా తతంగం అంతాను.

"మీరొకసారి మా సనత్‌నగర్‌కి రావాలి" అన్నాను.

"మీ సనత్‌నగర్ ఏమిటి; మన సనత్‌నగర్ అనాలి"

"మీరుకూడా సనత్‌నగర్‌లోనే ఉంటున్నారా?"

చెప్పేడు. నేను హైదరాబాదు నుండి ట్రాన్స్‌ఫర్ అయిపోయాక అతనికి సనత్‌నగర్‌లో క్వార్టర్స్ ఇచ్చేరు. ఆ తరువాత కొన్నేళ్లకి ఆ క్వార్టర్స్‌లో ఎవరెవరైతే ఉన్నారో వాళ్లకే ఆ క్వార్టర్స్ అమ్మేశారు. ఆ విధంగా అతను సనత్‌నగర్‌లో ఒక ఇల్లు గలవాడు అవడం "ఇంటి వాడు"

కావడం అదంతానూ. "ఇంతకీ సనత్‌నగర్‌లో ఒక బోర్డు సంస్కరణ కేసు ఉందా ఏమిటి; నాకెపుడూ కనబడలేదే?" అన్నాడు.

"ఉంది. అది కూడా నయాగరాకి సంబంధించినదే. ఎటొచ్చీ ఇంగ్లీషులో నయాగరా అని రాసి తెలుగులో "నయగారా" అని రాసేరు" అని అతన్ని అక్కడికి తీసుకెళ్ళి చూపించేను.

"నయగార అనేది తెలుగులో మంచి శబ్దం. అంచేత ఈ తెలుగురాత ఇలాగే వుంచి ఇంగ్లీషుదే మార్పించేస్తే సరి!" అని ఆ ప్రయత్నంలో పడ్డాడు బాషా.

అక్కణ్ణించి బాషా నన్ను తన ఇంటికి తీసుకెళ్ళాడు. "అయేషా!" అని పిలిచాడు. రాగానే "నా ఆవిడ!" అన్నాడు.

"మా ఆవిడ - అనేదే రైటు. గొప్పవాళ్ళు. సంస్కారులూ, అందరూ "మా ఆవిడ" అనే అంటారు. ఆఖరికి శ్రీకాకుళం జిల్లాలోని పేద వ్యవసాయ కార్మికుడు కూడా "మాయాడది" అనీ, "మా ఆడమనిషి" అనీ అంటాడు. స్త్రీలు కూడా "మా ఆయన" అని, "మా వారు" అనీ అంటారు తప్పా - నా ఆయన - అనరు"

అని నేను బాషాకి వివరించి అతని భాషని సంస్కరించ దలచుకోలేదు. అయేషా అనే స్త్రీ "అతని-ఆవిడ" అన్నది నిజం; ఆ ప్రయోగం వినోదాత్మకంగా ఉన్నాసరే.

★

# 57. గాభరా, గో!

"నువ్వు రోజూ ఆఫీసుకి లేటుగా వస్తున్నావనీ, సెక్యూరిటీ గేటు దగ్గిర డ్యూటీలో ఉండేవాళ్ళని కబుర్లలో పెట్టి సరైన టైమ్‌కే వస్తున్నట్టు నోట్ చేస్తున్నావనీ బాస్‌కి తెలిసినట్టుంది. కొన్నాళ్ళపాటు నీ రాకపోకల వేళలమీద నిఘా ఉంచమని నిన్న చెపుతూంటే నా చెవిని పడింది" అని మా డిప్యూటీ మేనేజర్ నిన్న సాయంకాలం నాతో గుట్టుగా చెప్పేడు.

ఇవాళ ఇంటి దగ్గర్నుంచీ సిటీబస్సు స్టేజి దగ్గిరికి వెళ్ళేలోగా ఈ మాటలు రకరకాల క్రియా విపరిమాణాలతో అన్వయ సంక్లిష్టతలతో తలలో మెదులుతూ వుంటే ఆ ఆందోళనలో ఇలా వచ్చి అలా బయలుదేరిన బస్సులో ఇతరుల్నెవర్నీ గమనించకుండా ఎక్కేశాను.

నిలబడ్డానికి మాత్రం స్థలం దొరికింది.

బస్సులోపల నిలబడవలసి వచ్చినా బస్సుకోసం నిలబడే అవసరం రాలేదు కదా అని తృప్తి పడుతూ చేతివాటు దూరంలో ఉన్న పట్టీ లాక్కుని సెటిలయ్యాను.

"గాభరాగో - అని పెట్టుకోవలసింది, నీ పేరు!" అని వెనకనించి ఓ రిమార్కు వినిపిస్తే స్పందించి అటు చూసేను. ముకుందరావు నన్నుచూసి నవ్వుతూ కనబడ్డాడు.

"ఎప్పుడు రావటం?" అని పలకరించేను.

"ఈ ఉదయమే గోదావరిలో దిగేను" అన్నాడు.



B